పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 708 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 05.09.2026 పేజీలు : 8 వెల : 4/-

### కేరళలో నారా లోకేశ్..

# అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం

**కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్**

- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం



అమరావతి, సెప్టెంబర్ 4 : ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని **తరువాయి 4లో**



## రైలు ప్రయాణికులకు అలర్ట్

# 8 రైళ్ల కొత్త వేళలివే

- నవంబర్ మొదటి వారం నుంచి కొత్త షెడ్యూల్ అమలు
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు స్టేషన్లపై ప్రభావం
- ప్రయాణానికి ముందు కొత్త సమయాలను చూసుకోవాలని ప్రయాణికులకు

**సూచన**

రైలు ప్రయాణికులకు ముఖ్య గమనిక. దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో నడిచే 8 కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను సవరించింది. ఈ మార్పులు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ముఖ్యమైన స్టేషన్లలో ప్రభావం చూపనున్నాయి. నవంబర్ 2026 మొదటి వారం నుంచి వేర్వేరు తేదీల్లో ఈ కొత్త షెడ్యూల్ అమల్లోకి వస్తుందని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందుగా కొత్త సమయాల **తరువాయి 2లో**

### ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

# జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్



- దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు
- విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం
- 9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు
- ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేసిన ఇండిగో, ఎయిర్ ఇండియా
- ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ (IMD)

**2లో**




## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని

'నా స్నేహితురాలు మెలోనీ' అంటూ మోదీ అభినందనలు

- ఇటలీలో ఎక్కువ కాలం పనిచేసిన ప్రధానిగా రికార్డు సృష్టించిన మెలోనీ
- మెలోనీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రధాని మోదీ **2లో**

## ఫుకెట్ విమాన ప్రమాదం

పైలట్ సస్పెన్షన్



- మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలిన పైలట్‌ను తొలగించిన ఎయిర్ ఇండియా
- ఫుకెట్-ఢిల్లీ విమానంలో తీవ్ర ఘటన అనంతరం ఈ చర్యలు తీసుకున్న సంస్థ
- ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి
- పైలట్‌పై చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో సిఫారసు
- భద్రత విషయంలో తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టం చేసిన ఎయిర్ ఇండియా

**2లో**

## ఎవరెస్ట్ మంచుకు ముప్పు

# అధ్యయనంలో షాకింగ్ నిజాలు



- ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కార్యకలాపాలతో మంచు కరుగుదల
- 2023లో 8.49 లక్షల మెగాజౌళ్ల వేడి విడుదల
- ఈ వేడి 2,492 టన్నుల మంచును కరిగించగలదు

**2లో**

### కొడంగల్: డిగ్రీ, గురుకుల

# భవన నిర్మాణాలపై సీఎం సమీక్ష

- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి రావాలని ఆదేశం
- భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం



తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం **తరువాయి 2లో**

## వంటింటిపై ధరల పిడుగు..

ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

- సామాన్యుడి వంటింట్లో ధరల మంట
- నెల రోజుల్లోనే రెట్టింపు స్థాయికి చేరిన ఉల్లి ధర
- వినియోగదారుడి జేబుకు చిల్లు
- రైతుకు గిట్టుబాటుతో ఆనందం
- వర్షాభావంతో భారీగా పడిపోయిన దిగుబడులు



- కొత్త పంట వచ్చేవరకు ధరలు తగ్గవంటున్న అధికారులు

**2లో**

# రైలు ప్రయాణికులకు అలర్ట్: 8 రైళ్ల కొత్త వేళలివే

(మొదటిపేజీ తరువాయి)

ను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. రైల్వే కార్యకలాపాలను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, పిడుగురాళ్ల, మార్కాపురం రోడ్, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల వంటి స్టేషన్లలో ఈ రైళ్ల రాకపోకల సమయాలు మారనున్నాయి. మారిన రైళ్ల వివరాలు, కొత్త సమయాలు కింద విధంగా ఉన్నాయి:

1. ట్రైన్ నెం. 17290 మైసూరు - కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్: ఈ రైలు సమయం నవంబర్ 7 నుంచి మారుతుంది. గుంటూరు: ప్రస్తుతం రాక సాయంత్రం 15:51 / పోక 15:56. కొత్త సమయం ప్రకారం రాక 15:00 / పోక 15:05.
2. ట్రైన్ నెం. 17296 హిసార్ - కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్: నవంబర్ 6 నుంచి కొత్త టైమింగ్స్ అమల్లోకి వస్తాయి. గుంటూరు: ప్రస్తుతం రాక సాయంత్రం 16:11 / పోక 16:16. కొత్త సమయం ప్రకారం రాక 15:40 / పోక 15:45.
3. ట్రైన్ నెం. 17444 చర్లపల్లి - తిరుపతి ఎక్స్‌ప్రెస్: నవంబర్ 6 నుంచి ఈ మార్పులు వర్తిస్తాయి. నడికుడి: కొత్త సమయం రాత్రి 19:19/19:20 (పాత సమయం 19:30/19:32). పిడుగురాళ్ల: కొత్త సమయం రాత్రి 19:38/19:40 (పాత సమయం రాత్రి 20:05/20:07). మార్కాపురం రోడ్: కొత్త సమయం రాత్రి 21:05/21:07 (పాత సమయం రాత్రి 21:20/21:22). గిద్దలూరు: కొత్త సమయం రాత్రి 22:05/22:07 (పాత సమయం రాత్రి 22:38). దిగువమెట్ట: కొత్త సమయం రాత్రి 22:20/22:30 (పాత సమయం రాత్రి 22:57/23:07). నంద్యాల: కొత్త సమయం రాత్రి 23:40/23:45 (పాత సమయం అర్ధరాత్రి 00:20/00:25).
4. ట్రైన్ నెం. 17251 గుంటూరు - కాచిగూడ ఎక్స్‌ప్రెస్: నవంబర్ 4 నుంచి ఈ రైలు బయలుదేరే సమయం మారుతుంది. గుంటూరు: ప్రస్తుతం సాయంత్రం 18:40కి బయలుదేరుతుండగా, కొత్తగా 18:00 గంటలకే బయలుదేరుతుంది.
5. ట్రైన్ నెం. 20630 తిరువనంతపురం నార్త్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్: నవంబర్ 4 నుంచి మార్పులు వర్తిస్తాయి. సత్తెనపల్లి: కొత్త సమయం ఉదయం 06:44/06:45 (పాత సమయం ఉదయం 06:54/06:55).
6. ట్రైన్ నెం. 17625 కాచిగూడ - రేపల్లె ఎక్స్‌ప్రెస్: నవంబర్ 4 నుంచి మార్పులు అమల్లో ఉంటాయి. పిడుగురాళ్ల: కొత్త సమయం అర్ధరాత్రి తర్వాత 02:41/02:42 (పాత సమయం 02:51/02:52).
7. ట్రైన్ నెం. 17078 తిరుచిరాపల్లి - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్: నవంబర్ 4 నుంచి ఈ మార్పులు వర్తిస్తాయి. గుంటూరు: కొత్త సమయం మధ్యాహ్నం 14:40/14:50 (పాత సమయం 15:05/15:15). సత్తెనపల్లి: కొత్త సమయం మధ్యాహ్నం 15:19/15:20 (పాత సమయం 15:33/15:35). నడికుడి: కొత్త సమయం 15:59/16:00 (పాత సమయం 16:23/16:25).
8. ట్రైన్ నెం. 17042 తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్: నవంబర్ 4 నుంచి ఈ రైలు సమయాలు మారతాయి. గుంటూరు: కొత్త సమయం సాయంత్రం 17:00/17:10 (పాత సమయం 17:40/17:50). సత్తెనపల్లి: కొత్త సమయం సాయంత్రం 17:45/17:46 (పాత సమయం 18:59/19:00).

ఈ మార్పుల నేపథ్యంలో, ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందుగా ఇండియన్ రైల్వేస్ అధికారిక వెబ్‌సైట్, ఐఆర్‌సీటీసీ (IRCTC), ఎన్‌టీఈఎస్ (NTES) యాప్ లేదా సమీపంలోని రైల్వే స్టేషన్లలోని విచారణ కేంద్రాల ద్వారా తాజా సమాచారాన్ని నిర్ధారించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

### ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం..

## జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.



### వంటింటిపై ధరల పిడుగు..

## ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

సామాన్యుడి వంటింట్లో ధరల మంట రాజుకుంది. నిత్యావసరాలైన ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర నెల రోజుల వ్యవధిలోనే రెట్టింపు కావడంతో వినియోగదారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయితే, ఈ ధరల పెరుగుదల రైతులకు మాత్రం ఊరటనిస్తోంది. హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెల క్రితం క్వింటాల్ రూ. 2,000 ఉన్న మహారాష్ట్ర ఉల్లి ధర, ఇప్పుడు ఏకంగా రూ. 5,000 మార్కును తాకింది. ఏడాది కాలంలో ఇదే గరిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి బాటలోనే అల్లం, వెల్లుల్లి కూడా పయనిస్తున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన అల్లం క్వింటాల్ రూ. 16,000 పలుకుతుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అయిన వెల్లుల్లి ధర క్వింటాల్‌కు రూ. 19,000గా నమోదైంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ. 250 దాటిపోయింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలో గత జూన్, జులై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. మరోవైపు, కర్ణాటక, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ఫలితంగా, రోజుకు 20 వేల క్వింటాళ్లు రావాల్సిన మలక్‌పేట మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం 5 వేల క్వింటాళ్ల ఉల్లి మాత్రమే వస్తోంది. ధరల పెరుగుదల వినియోగదారులకు భారంగా మారినప్పటికీ, రైతులకు మాత్రం ఆనందాన్నిస్తోంది. గతంలో గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపై పారబోసిన రైతులు, ఇప్పుడు మంచి ధర దక్కుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరలు తగ్గకపోవచ్చని, ఈ భారం తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

## ఫుకెట్ విమాన ప్రమాదం: పైలట్ సస్పెన్షన్

విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షల్లో పాజిటివ్‌గా తేలడంతో పైలట్ ఇన్‌కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరోటాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్ ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షల్లో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది.

**ఏం జరిగింది?**

వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షల్లో పీఐసీకి "నాన్‌నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కోపైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..

### 'నా స్నేహితురాలు మెలోనీ' అంటూ మోదీ అభినందనలు

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని 'నా స్నేహితురాలు' అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మోదీ స్పందిస్తూ.. "ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక" అని పేర్కొన్నారు. భారత్ ఇటలీ మధ్య 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాళ్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. గత మే నెలలో మోదీ ఇటలీలో పర్యటించినప్పుడు ఇరు దేశాల సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ ఇరు నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా మోదీ, మెలోనీకి సరదాగా 'మెలోడీ' చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. సోషల్ మీడియాలో వారిద్దరి పేర్లతో వైరల్ అయిన '#Melodi' ట్రెండ్‌ను ఇది గుర్తుచేసింది. ఈ ఆసక్తికర క్షణాలను మెలోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరు నేతల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎవరెస్ట్ మంచుకు కొత్త ప్రమాదం..

## షాకింగ్ విషయాలు వెల్లడించిన అధ్యయనం

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం వద్ద మరో ఆందోళనకర విషయం బయటపడింది. బేస్ క్యాంప్‌లో పెరుగుతున్న మానవ కార్యకలాపాలు ఖుంబు హిమానీనదం కరుగుదలను మరింత పెంచుతున్నాయని తాజా అధ్యయనం తెలిపింది. వాతావరణ మార్పులతో పాటు ఇంధన వినియోగం, మనుషుల మూత్ర విసర్జనతో విడుదలయ్యే వేడి కూడా దీనికి కారణమవుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ప్రతి క్లైంబింగ్ సీజన్‌లో వేలాది మంది పర్వతారోహకులు, పర్యాటకులు, గైడ్లు, సిబ్బందితో సందడిగా మారుతుంది. వంట, విద్యుత్, వేడి కోసం ఎల్పీజీ, కిరోసిన్, పెట్రోల్ వాడుతున్నారు. వీటి నుంచి భారీగా వేడి విడుదలవుతోంది. మనుషుల మూత్ర విసర్జనను కూడా పరిశోధకులు లెక్కల్లోకి తీసుకున్నారు. 2023 వసంతకాలంలో బేస్ క్యాంప్‌లో విడుదలైన మొత్తం వేడి 8,49,174 మెగాజౌళ్లుగా అంచనా వేశారు. ఈ వేడి దాదాపు 2,492 టన్నుల మంచును కరిగించగలదని అధ్యయనం వెల్లడించింది. 1991 నుంచి 2023 వరకు ల్యాండ్శాట్ ఉపగ్రహ సమాచారాన్ని పరిశీలించగా బేస్ క్యాంప్ ప్రాంతంలో ఉష్ణోగ్రత ఏటా 0.28 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు తేలింది. ఖుంబు హిమానీనదంతో పోలిస్తే ఇక్కడ వేడెక్కుతున్న వేగం దాదాపు రెండింతలుగా ఉంది. ప్రస్తుతం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ హిమానీనదంపైనే ఉంది. పరిస్థితులు మరింత దిగజారితే క్యాంప్‌ను తరలించాల్సి రావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుత క్యాంప్‌కు నైరుతి దిశలో స్థిరమైన నేలపై రెండు ప్రత్యామ్నాయ ప్రాంతాలను కూడా గుర్తించారు.

### నేపాల్ మహా విషాదంలో ఒక అద్భుతం..

## 9 రోజుల తర్వాత సొరంగం నుంచి ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు!

నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే ఆశలు బలపడ్డాయి. నేపాల్‌లోని త్రిశూలి 3A జల విద్యుత్ ప్రాజెక్టులో ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది.

## సంపాదకీయం

# ఉపాధ్యాయ దినోత్సవం
# నాటి విశిష్టత – నేటి వాస్తవికత

ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవం. మన దేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన రాష్ట్రపతి అయినప్పుడు ఆయన విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఆయన పుట్టినరోజును పండుగలా చేయాలని కోరగా, తన పుట్టినరోజును టీచర్స్ డేగా జరిపితే బాగుంటుంది అనుకున్నారట. తద్వారా దేశంలోని ఉపాధ్యాయులను గౌరవించినట్లుగా ఉంటుంది అని అనగానే 1962 లో ప్రభుత్వం ఆయన పుట్టినరోజైన సెప్టెంబర్ 5 ను ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది. విలువలు కలిగిన సమాజపు తీరు అది. రాధాకృష్ణన్ తెలుగు ప్రాంతం వారు కావడం మనం గర్వించదగ్గ విషయం. ఇంకా మనం గర్వించదగ్గ మరో విషయం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రాచ్య ధర్మాలు, నీతిశాస్త్రం బోధించిన తొలి భారతీయుడు ఈయన. ఆయనలోని విద్వత్తును గమనించి తొలి ప్రధాని నెహ్రూ ఆయనను రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా చేశారు. తరువాత రష్యా రాయబారిగా, పది సంవత్సరాలు ఉపరాష్ట్రపతిగా, అనంతరం రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించే సమయంలో ఎటువంటి పక్షపాతం చూపని ఆయన నైజం నెహ్రూని ఎంతగానో ఆకర్షించింది అంటారు. ఇద్దరు ప్రధానులతో పనిచేశారు, రెండు యుద్ధాలు చూశారు. రాజకీయాలకు, ఓటు బ్యాంకులకు అతీతంగా దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేశాయి కాబట్టే సర్వేపల్లి రాధాకృష్ణన్ ను 50 ల్లోనే భారతరత్న వరించడమే కాక దేశ అత్యున్నత పదవులు కూడా అలంకరించాయి. అటువంటి వారి పుట్టినరోజును మనం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనల్ని మనం అభినందించుకోవలసిన విషయం. ఈ సందర్భంగా ఒక వ్యక్తికి మనం సెల్యూట్ చేయాలి. ప్రపంచాన్ని కుదిపేసిన సంఘటన నేపాల్‌లో వచ్చిన ఆకస్మిక వరదలు. దారుణమైన విషాదం అది. అంత విషాదంలోనూ 1600 పైచిలుకు విద్యార్థులను తన సమయస్ఫూర్తితో కాపాడారు ఒక గురువు. త్రిశూలి నది ఒడ్డున ఉన్న త్రిభువన్ త్రిశూలి సెకండరీ పాఠశాల సమీపంలో కొండచరియలు విరిగిపడి భారీ ఎత్తున వరదనీరు, బురద ఉధృతంగా వచ్చాయి. వరద ఉధృతంగా వస్తోందని తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర దవాడే స్కూల్ బెల్ కొట్టి, పిల్లలను తరగతి గదుల్లో నుండి బయటకు రప్పించి ఎత్తుగా ఉన్న ప్రాంతానికి తీసుకుని వెళ్లారు. విద్యార్థులు ఎత్తుగా ఉన్న ప్రాంతానికి చేరుకున్న మూడు నిమిషాల్లోనే వరద ముంచెత్తి పాఠశాల ఆనవాళ్లు కూడా మిగలకుండా కొట్టుకుపోయింది. ఆ పిల్లలకు తల్లిదండ్రులు జన్మనిస్తే, వారి గురువు పునర్జన్మను ప్రసాదించారు. సంక్షోభ సమయ స్ఫూర్తితో ఎదుర్కొన్న రాజేంద్ర దవాడే నిజమైన హీరో అయ్యారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఆయనకు మనమందరం శుభాకాంక్షలు తెలపాలి. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తరువాత మనల్ని ఎక్కువగా ప్రభావితం చేసేది గురువులే. తల్లిదండ్రులు మనకు నడక మాత్రమే నేర్పుతారు. గురువు మనకు విద్యాబోధన చేస్తూ మన నడవడికలో ఉండే పొరపాట్లను సరిదిద్దే గురుతరమైన బాధ్యతను తీసుకుంటారు. అంటే తల్లిదండ్రుల కంటే గురువు మీదే బాధ్యత ఎక్కువ. గురువుల్లో ఉద్యోగం మాత్రమే చేసేవారు కొందరైతే, వృత్తిగా స్వీకరించేవారు మరికొందరు. బడికి వచ్చామా, పాఠం చెప్పామా, ఇంటికి వెళ్ళిపోయామా అనేవారు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటే పిల్లలు చదువుకుంటారు కానీ విజ్ఞానవంతులు కాలేరు. పూర్వకాలంలో ఎవరి అవసరం కోసం వారు వృత్తిపరమైన విద్యను అభ్యసించేవారు. అలాంటి పరిస్థితి మారిపోయి ఇప్పుడు మూస చదువులు వచ్చాయి. గతంలో జిల్లా పరిషత్ పాఠశాలల్లో క్రాఫ్ట్ టీచర్, సంగీతం టీచర్ కూడా ఉండేవారు. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల్లో డ్రిల్ మాస్టర్ కూడా ఉండటం లేదు. క్రాఫ్ట్ టీచర్ అంటే ఇప్పటి విద్యార్థులకు తెలిసే కూడా ఉండదు. నైపుణ్యాభివృద్ధి బాధ్యతను ఆనాడు క్రాఫ్ట్ టీచర్లు తీసుకునేవారు. మూస చదువులు వచ్చాక ఉపాధ్యాయ వృత్తి కేవలం ఒక ఉద్యోగం అయిపోయింది. మన దేశంలో ఒకనాడు ఉపాధ్యాయ వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. అందుకే మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మీద ఉన్న గౌరవంతో ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారు. కానీ ఇప్పుడు ఉపాధ్యాయ వృత్తిని కూడా రాజకీయం చేస్తున్నారు. సాధారణంగా ఆ వృత్తిలో ఉన్న వారిని ఏదైనా మాట అనడానికే సంకోచించేవారు. మన దేశంలో ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా అత్యున్నత సమాజ సేవగా భావించేవారు. అందుకే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అంటాము. కానీ వారిని మద్యం దుకాణాల వద్ద కూడా కూర్చోబెట్టింది జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం. ఉపాధ్యాయులను వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకున్నంతగా ఎవరూ ఉపయోగించలేదు. వారికి బోధన కంటే ఇతర పనుల బాధ్యతలను అప్పగించింది. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన మెనూ ప్రకారం చేశారో లేదో చూసి ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయవలసి వచ్చేది. తనిఖీ చేయడం వేరు, ప్రతిరోజూ పాఠశాలల మౌలిక వసతుల పర్యవేక్షణ, ఇంకా అనేక పనులతో కలిపి నిత్యం పది యాప్‌లను ఆర్గనైజ్ చేయవలసి వచ్చేది. పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడటం కూడా ఉపాధ్యాయులదే బాధ్యత అయింది. అన్నిటికంటే మించి కోవిడ్ లాక్‌డౌన్ రోజుల్లో మద్యం దుకాణాల వద్ద జనాన్ని నియంత్రించే పనులు కూడా చేయవలసి వచ్చింది. ఇది తీవ్రమైన అసంతృప్తికి కారణమైంది. నవరత్నాల లబ్ధిదారుల సమాచారం సేకరించే పనిని కూడా ఉపాధ్యాయులకే అప్పజెప్పారు. ఇలాంటి పనులు ఉపాధ్యాయులకు ప్రభుత్వాలు అప్పగిస్తాయని ఎవరూ ఊహించను కూడా ఊహించలేదు. అప్పట్లో బోధన మీద ధ్యాసను కేంద్రీకరించలేకపోతున్నామని వారు వాపోయారు. రానురాను ఉపాధ్యాయ వృత్తి ఇలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నది. గతంలో మాదిరిగా పాఠాలు చెప్పడం ఒక్కటే వారి బాధ్యత కాదు; ఫలితాలను చూపించడం అనేది ప్రధానమైన విధిగా మారింది. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను కూడా వారే చూడాలి. ప్రతిరోజూ సాయంత్రం ఒక గంట, రెండు గంటలు కాన్ఫరెన్స్ కాల్‌లో అడ్మిషన్ల గురించి రిపోర్టు ఇవ్వాలి, ఇంకా అడ్మిషన్లు ఎలా పెంచాలనే విషయంలో యాజమాన్యాల ఆదేశాలు వినాలి. ఇన్ని ఒత్తిళ్ల మధ్య వృత్తికి న్యాయం చేయడం వారికి కష్టమవుతోంది. వీటికి మించి నేడు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య సత్సంబంధాలు ఉండటం లేదు. ఉపాధ్యాయుల పట్ల మనం 'అమెరికాకు తక్కువ, ఇండియాకు ఎక్కువ' అన్నట్లు వ్యవహరిస్తున్నాం. విద్యార్థిని మందలించే పరిస్థితుల్లో ఉపాధ్యాయులు లేరు. తప్పు ఎత్తి చూపించాలంటే భయం వేసే పరిస్థితులు వచ్చేశాయి. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల వైఖరి మారిపోతే సమాజం చాలా నష్టపోతుంది. 'తల్లి, తండ్రి, గురువు, దైవం' అనే మన భారతీయ తత్వాన్ని కొనసాగించాలి. తరగతి గదిలోనే విద్యావసరాలు తీరిపోవు. పుస్తకానికి ఆవల ఉన్న ప్రపంచంలోకి వెళ్లడానికి నేర్చుకోవలసినవి ఎన్నో ఉంటాయి. అలాంటి జీవిత పాఠాలను నేర్పే గురువును గౌరవించుకుందాం.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 5

SEP 05

* 1888: భారతదేశపు రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జననం (మ.1975).
* 1915: భారతదేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం.
* 1803: తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు పురుషోత్తమ చౌదరి జననం.(మ.1890)
* 1922: పత్రికా రచయిత, కవి రెంటాల గోపాలకృష్ణ జననం (మ.1995).
* 1926: తెలుగు రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి జననం (మ.2014).
* 1955: తెలంగాణకు చెందిన విద్యావేత్త, ఆచార్యులు కోదండరాం జననం.
* 1986: భారతీయ వృక్ష శాస్త్రవేత్త గణపతి తనికైమోని మరణం. (జ.1938)
* 1988: నంద్యాల సమీపంలోని గాజులపల్లెకు చెందిన మహిళా కమ్యూనిస్టు నేత కొట్రికె పద్మావతమ్మ మరణం (జ.1923).



మదర్ తెరెసా

* 1997: భారతరత్న పురస్కారం, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ తెరెసా మరణం (జ.1910) (చిత్రంలో).
* 2010: భారతీయ శాస్త్ర పరిశోధకుడు హోమీ సేత్నా మరణం (జ.1923).
* 2013: మాజీ శాసన సభ్యులు, పీలేరు గాంధీగా సుప్రసిద్దులు చల్లా కృష్ణనారాయణరెడ్డి మరణం.(జ.1925)

## ఏపీలో ఉత్తమ ఉపాధ్యాయుల
# జాబితా విడుదల

అమరావతి: 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక చేసింది. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ అవార్డులను ఖరారు చేశారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సత్కరించనుంది.

## మున్సిపల్ కార్పొరేషన్లలో
# వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల



అమరావతి: రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. దీనికి సంబంధించి ఇవాళే ప్రతిపాదనలు పంపాల్సిందిగా కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతిపాదనలపై రేపటి నుంచి ఈనెల 11 వరకు ఏడు రోజులపాటు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నట్టు పురపాలకశాఖ పేర్కొంది. ఈనెల 13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటనకు డైరెక్టర్ పరిశీలన తర్వాత ఆమోదం లభించనుంది. 14న ఏపీ గెజిట్‌లో వార్డులు డీలిమిటేషన్ ప్రకటన చేయనున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా వార్డులు నిర్ణయించనున్నారు. జీవీఎంసీ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం, కార్పొరేషన్లకు ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి.



## జంగారెడ్డిగూడెంలో
# కాలం చెల్లిన మత్తు ఇంజెక్షన్ల కలకలం

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో కాలం చెల్లిన మత్తు ఇంజెక్షన్ల గుట్టును డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు రట్టు చేశారు. స్థానిక డాంగేనగర్‌లోని ఓ కార్పెంటరీ దుకాణంలో దాచిన 7,550 ట్రెమడాల్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు కిశోర్ తన వద్ద కాలం చెల్లిన మత్తు ఇంజెక్షన్లు లేవని, వాటిని డంపింగ్ యార్డులో ధ్వంసం చేసినట్లు అధికారులను తప్పుదోవ పట్టించారు. తనిఖీలు జరిగితే ఎవరికీ దొరక్కుండా.. డాంగేనగర్‌లోని తన స్నేహితుడి కార్పెంటర్ దుకాణంలో భద్రపరిచాడు. సోదాలు నిర్వహించిన అధికారులు 7,550 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు పట్టణంలోని భవాని మెడికల్స్ నిర్వాహకుడు మరో 3 వేల ఇంజెక్షన్లను విక్రయించినట్లు తేలిందని డ్రగ్ ఇన్స్పెక్టర్లు మల్లికార్జునరావు, అబిద్ ఆలీ తెలిపారు. కాలం చెల్లిన మత్తు ఇంజెక్షన్ల విక్రయాలకు పాల్పడిన రెండు ఏజెన్సీలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ శోభ పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు ట్రెమడాల్ ఇంజెక్షన్లు సరఫరా లేదని ఆమె స్పష్టం చేశారు.

# కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం

(మొదటిపేజీ తరువాయి)

దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.









## 2 నిమిషాల్లో ఇంటికి.. ఇంతలో ప్రమాదం
# అన్నదమ్ములు మృతి

మల్కిపురం: రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ఘోర ప్రమాదం జరిగి అన్నదమ్ములిద్దరు మృతి చెందారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా మల్కిపురం మండలం లక్కవరం శివారు ఓఎన్జీసీ సైట్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముదునూరి రామభద్ర రాజు అలియాస్ రాంబాబు రాజు, అతని సోదరుడు వెంకటసుబ్బరాజులు రొయ్యలు, ఎరువుల వ్యాపారం నిర్వహిస్తారు. ఇద్దరూ వారి భార్యలతో కలసి బంధువుల ఇంటికి భీమవరం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి శుక్రవారం



ఉదయం స్వగ్రామానికి వస్తుండగా.. లక్కవరం ఓఎన్జీసీ సైట్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామభద్ర రాజు, వెంకటసుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందారు. తోడికోడళ్లు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు స్పందించి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. మరో 2 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ఈ ప్రమాదం జరిగింది. రామభద్రరాజుకు ఇద్దరు కుమారులు కాగా.. ప్రస్తుతం వారు అమెరికాలో ఉంటున్నారు. వెంకటసుబ్బరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# అనంతపురం జిల్లాలో ప్రైవేటు బస్సు దగ్ధం



అనంతపురం: బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరు వద్దకు రాగానే బస్సులో పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేశారు. 33 మంది ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు దిగిన వెంటనే.. క్షణాల్లో బస్సు మొత్తం దగ్ధమైంది. ప్రాణ నష్టం తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక

- **ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ**
- **క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం**
- **ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులుకార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని



తీర్మానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల 60 ఏళ్ల నిరీక్షణకు తెర

- **నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసులకు ఇళ్ల పట్టాల మంజూరు**
- **60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం**
- **1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం**
- **మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం**
- **త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు**

నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**ఏళ్ల తరబడి ఎదురుచూపులు..**

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది



మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- **మంత్రి నారాయణ చొరవతో పరిష్కారం..**

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే: పవన్ కల్యాణ్



రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాటేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..**

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఇంటింటికీ తెలుగుదేశం: 45 రోజుల లక్ష్యం ముందే పూర్తి.. కోటి కుటుంబాలను పలకరించిన టీడీపీ

- కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై టీడీపీ భారీ ప్రచార కార్యక్రమం
- 'ఇంటింటికీ తెలుగుదేశం' పేరుతో 45 రోజుల డోర్ టు డోర్ యాత్ర
- లక్ష్యానికి ముందే కోటి కుటుంబాలను సందర్శించి రికార్డు సృష్టించిన శ్రేణులు
- ప్రభుత్వ విజయాలను వివరిస్తూ, స్థానిక సమస్యలపై ఫీడ్‌బ్యాక్ సేకరణ
- కార్యకర్తలను అభినందించిన టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) చేపట్టిన బృహత్తర ప్రచార కార్యక్రమం 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' రికార్డు స్థాయిలో విజయవంతంగా కొనసాగుతోంది. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటినీ పలకరించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, నిర్దేశిత గడువు కంటే ముందే కోటికి పైగా కుటుంబాలను సందర్శించి చారిత్రక మైలురాయిని అందుకుంది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూనే, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగింది. ఈ చారిత్రక విజయంపై టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల కృషిని అభినందిస్తూ ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "ఇంటింటికీ తెలుగుదేశం2026 కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు. ఇంటింటి పర్యటనల్లో ప్రజలను కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించిన తీరు అద్భుతం. కేవలం సందర్శించడమే కాకుండా, ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

### కార్యక్రమ నేపథ్యం, ప్రస్థానం

వాస్తవానికి ఈ కార్యక్రమానికి జూన్‌లోనే బీజం పడింది. చంద్రబాబు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు "సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం" నినాదంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవరించిన షెడ్యూలును ప్రకటించారు. జులై 27 నుంచి 45 రోజుల పాటు నిరంతరాయంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రారంభానికి ఒకరోజు ముందు, జులై 26న చంద్రబాబు నాయుడు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనుకున్నట్టుగానే జులై 27న నారా లోకేశ్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఈ మహాయజ్ఞం ప్రారంభమైంది.



### లక్ష్యాలు, సాధించిన ప్రగతి

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. దీంతో పాటు, గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను స్పష్టం చేస్తూ, ప్రజల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించడం, తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు.

* **ఈ యాత్ర పురోగతి అంచనాలను మించి సాగింది.**

**కీలక మైలురాళ్లు**

* ప్రారంభం (జులై 27): రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం ఉత్సాహంగా మొదలైంది.
* 2వ రోజు (జులై 28): 2.18 లక్షల ఇళ్లను సందర్శించారు. కుప్పంలో నారా భువనేశ్వరి ప్రచారంలో చురుగ్గా పాల్గొని కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు.
* 8వ రోజు (ఆగస్టు 3): సందర్శించిన ఇళ్ల సంఖ్య 20.61 లక్షలకు చేరింది.
* 13వ రోజు (ఆగస్టు 8): ఒక్క రోజే 3.56 లక్షల ఇళ్లను సందర్శించడంతో, మొత్తం సంఖ్య 37.21 లక్షలకు పెరిగింది.
* 21వ రోజు (ఆగస్టు 16): 61.61 లక్షలతో 60 లక్షల ఇళ్ల మైలురాయిని దాటింది.
* 37వ రోజు (సెప్టెంబర్ 1): 97.32 లక్షల ఇళ్లను సందర్శించి, కోటి ఇళ్ల లక్ష్యానికి చేరువైంది.
* 39వ రోజు (సెప్టెంబర్ 3): 99.85 లక్షల కుటుంబాలను పలకరించి, కోటి మైలురాయికి అత్యంత సమీపానికి వచ్చింది.
* 40వ రోజు (సెప్టెంబర్ 4): విజయవంతంగా కోటి మార్కును అధిగమించింది.

### నాయకత్వం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ

ఈ కార్యక్రమం విజయవంతం కావడం వెనుక నారా లోకేశ్ పర్యవేక్షణ కీలక పాత్ర పోషించింది. ఆయన మొదటి నుంచి టెక్నాలజీని ఉపయోగించి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పురోగతిని సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం, కూటమిలోని ఇతర పక్షాలతో సమన్వయం చేసుకోవడంలో లోకేశ్ వ్యూహం ఫలించింది.

### ప్రతిపక్షాల విమర్శలు, టీడీపీ స్పందన

అయితే, ఈ కార్యక్రమంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' వంటి హామీలు పూర్తిగా అమలు కాలేదని, వాటిని అయినట్టుగా ప్రచారం చేసుకునే ప్రయత్నమే ఇదని వారు ఆరోపించారు. ఈ విమర్శలపై టీడీపీ స్పందిస్తూ, రెండేళ్లలో సాధించిన పురోగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాస్తవ గణాంకాలతో ప్రజల ముందు ఉంచుతున్నామని, ఇది కేవలం ప్రచారం కాదని, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి పాలనను మరింత మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన కార్యక్రమమని స్పష్టం చేసింది. మొత్తం మీద, "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు టీడీపీకి ఒక బలమైన వేదిక లభించింది. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన ఫీడ్‌బ్యాక్‌తో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ఠమైన వ్యూహంతో సిద్ధమయ్యేందుకు టీడీపీకి మార్గం సుగమమైంది.

# కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం

* **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు. "పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

# ఒవైసీ సోదరులు దేశ భక్తులు ఎలా అవుతారు..?: రామచందర్‌రావు



హైదరాబాద్: ఒవైసీ సోదరులు దేశ భక్తులు ఎలా అవుతారని సీఎం రేవంత్ రెడ్డిని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. భాజపా జాతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మీయ సత్కార సభకు రామచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "వందేమాతరం ఆలపించని వారు దేశభక్తులు ఎలా అవుతారో ముఖ్యమంత్రి చెప్పాలి. అసలు దేశభక్తి సర్టిఫికెట్ ఇవ్వడానికి రేవంత్‌రెడ్డి ఎవరు? అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి మద్దతునిచ్చే అసదుద్దీన్ ఒవైసీ.. కొత్తగా రేవంత్ రెడ్డికి మద్దతు ఇస్తున్నాం అనడం విడ్డూరంగా ఉంది. అధికార పార్టీలకు మద్దతునిస్తూ ఒవైసీ సోదరులు బాగుపడుతున్నారే తప్పితే.. వాళ్ల వల్ల ఏ ఒక్క ముస్లిం జీవితం బాగుపడలేదు. బెంగాల్‌లో మమతా బెనర్జీ దేశ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించినట్లే.. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలోకి చొరబాటుదారులను, రోహింగ్యాలను తీసుకొస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో కూడా ఏ స్థాయిలో దోచుకున్నారో వారి కుటుంబసభ్యులే చెబుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఫ్యామిలీ, కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ రాష్ట్రాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

# ఈ పని చేస్తే రేషన్ కార్డు కట్.. తెలంగాణ సర్కారు కఠిన నిర్ణయం

- ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిక
- అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వని సర్పంచుల పదవులు ప్రమాదంలో పడతాయని స్పష్టీకరణ
- పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ
- కరువు సూచనల నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు



ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆ ప్రచారం నమ్మొద్దు.. బిగ్ అప్‌డేట్‌పై స్పందించిన కొండా సురేఖ



హైదరాబాద్: త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుందని తాను ప్రకటించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి కొండా సురేఖ ఖండించారు. కొండా సురేఖ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాలో "త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుంది. 'వెయిట్ ఈజ్ ఆల్‌మోస్ట్ ఓవర్'.." అంటూ ఆసక్తికర పోస్టు వైరల్ అయింది. దీనిపై కొండా సురేఖ స్పందించి.. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. "వివిధ సోషల్ మీడియా వేదికల్లో నా పేరుతో ప్రసారమవుతున్న పోస్టులతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మీడియా ప్రతినిధులు, ప్రజలు కేవలం అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతున్నాం" అని పోస్టు చేశారు.

# దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి: కవిత

- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ



తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.




# తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు కీలక సూచనలు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (KRMB) కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేయవద్దని సూచించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలని పేర్కొంది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పింది. ఉమ్మడి జలాశయాల్లో తక్కువ నీరు ఉన్నందున పొదుపుగా వాడుకోవాలని సూచించింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యమివ్వాలని విభజన చట్టం చెబుతోందని కృష్ణా బోర్డు పేర్కొంది.



# భారత్ ముందే హెచ్చరించింది.. మేం వింటేగా!

చైనా విషయంలో భారత్ తమను ముందుగానే హెచ్చరించిందని బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ అన్నారు. కానీ, అప్పుడు తాము వినకపోవడం వల్ల ఐరోపా దేశాలు అనేక సమస్యలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. చౌకగా దొరికే విదేశీ వస్తువుల దిగుమతికి అనుమతించడంతో యూరప్ దేశాలను అవి ముంచెత్తాయని పేర్కొన్నారు. దీంతో ఐరోపా దేశాల్లో పరిశ్రమలు దెబ్బతినడమే కాకుండా విదేశీ సరఫరాదారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కార్యక్రమంలో బార్ట్ డె వెవర్ పాల్గొని మాట్లాడారు. ''గడిచిపోయిన రోజులు ఐరోపాకు ఓ కఠినమైన వాస్తవాన్ని తెలియజేశాయి. చాలా కాలంగా మార్కెట్లలో విదేశీ ఉత్పత్తులను తక్కువ ధరలకే అమ్ముతుంటే చూస్తూ ఉండిపోయింది. దీంతో పారిశ్రామిక పునాది పూర్తిగా బలహీనపడిపోయింది. కొందరు దీనిని అవకాశంగా ఉపయోగించుకొని మేం పూర్తిగా వారిపై ఆధారపడేలా చేశారు (యూరోపియన్ మార్కెట్లలో చైనా వస్తువుల డంపింగ్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ). కానీ, ఈ విషయాన్ని ఐరోపా కంటే ముందే భారత్ గుర్తించింది. ఇతర దేశాలపై అధారపడొద్దని మోదీ అప్పుడే మమ్మల్ని హెచ్చరించారు. కానీ మేం వినలేదు. ఇకపై వింటాం' అని బెల్జియం ప్రధాని పేర్కొన్నారు.

**మా జాబితాలో భారత్ నెం.1..**

భౌగోళిక రాజకీయ అనిశ్చితి సమయంలో బ్రస్సెల్స్ ఇప్పుడు భారత్‌ను ఒక కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని బార్ట్ డె వెవర్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాల జాబితాలో భారత్ లేకపోతే వారు ఓ ముఖ్యమైన స్నేహితుడిని కోల్పోతున్నట్లేనని అన్నారు. వాణిజ్య విధానాలను ఆకస్మికంగా మారుస్తూ.. సుంకాలు విధించే దేశాలు విశ్వసనీయమైనవి కావని తెలిపారు. విశ్వాసం ఆధారంగా సంబంధాలు నిర్మించుకోగల భాగస్వాములు బెల్జియంకు ఎంతో అవసరమని తెలిపారు. భారత్‌తో బంధాలను ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మరో స్థాయికి తీసుకెళ్లాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.



## నేపాల్.. ఇంకా ఆచూకీ లేని 275 మంది భారతీయులు

నేపాల్ జలప్రళయంలో 275 మంది భారతీయుల ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. నేపాల్‌లో చిక్కుకుపోయిన 166 మందిని అక్కడి సిబ్బంది రక్షించినట్లు తెలిపింది. 1,907 మంది భారతీయులు చైనా నుంచి నేపాల్‌కు సురక్షితంగా చేరుకున్నారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ తెలిపారు. గల్లంతైన భారతీయుల విషయమై నేపాల్ ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుతూనే ఉన్నామని జయస్వాల్ పేర్కొన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా అక్కడి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని, వారికి అవసరమైన సహాయాన్ని భారత్ అందిస్తూనే ఉంటుందన్నారు. మరిన్ని ఫోరెన్సిక్ కిట్లు, బైలీ వంతెనలను పంపిస్తామన్నారు. ఇప్పటివరకు నేపాల్‌కు ఏడు విమానాల్లో 95 టన్నుల సహాయక సామగ్రి తరలించామని అన్నారు. దీనికితోడు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు 54 మంది సిబ్బందిని పంపించినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే, నేపాల్ వరదల్లో మరణించినవారి సంఖ్య 1,295కు చేరగా, సుమారు 5వేల మంది ఆచూకీ లభ్యం కాలేదు.

## 300 సార్లు ఎన్నికల్లో పోటీ.. ఆ 'ధర్తీపకడ్' ఇక లేరు

ఆయన వ్యాపారవేత్త అయినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు అండగా నిలిచేవారు. అయితే, ప్రజలను రాజకీయంగా చైతన్య పరచాలన్నది ఆయన ప్రయత్నం. ఇందుకోసం ఎన్నికల్లో పోటీ చేయడాన్ని ఓ మార్గంగా ఎంచుకొని దాదాపు 300 సార్లు పోటీ చేశారు. ఆయనే బిహార్‌కు చెందిన నాగర్మల్ బజోరియా. స్థానికంగా 'ధర్తీ పకడ్'గా పేరు తెచ్చుకున్న ఈయన 97 ఏళ్ల వయసులో కన్నుమూశారు. బ్రిటిష్ ఇండియాలో లాహోర్‌లో



(1930లో) జన్మించిన నాగర్మల్.. స్వాతంత్ర్యానికి ముందే బిహార్‌లోని భాగల్‌పుర్‌కు కుటుంబంతో వలస వచ్చారు. సామాజిక సేవలో ముందుండే ఆయన పేద అమ్మాయిలకు సామూహిక వివాహాలు జరిపించేవారు. సొంత ఖర్చులతో నీటి వనరులను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలతో స్థానికంగా 'ధర్తీ పకడ్'గా పేరు తెచ్చుకున్నారు. 30 ఏళ్ల వయసులో భాగల్‌పుర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు. ఫలితమేదైనా సరే.. ఎన్నికల్లో పోటీ చేయడాన్ని జీవితంలో భాగంగా ఎంచుకున్నారు. స్థానిక సంస్థలు మొదలు రాష్ట్రపతి ఎన్నికల వరకు అనేక స్థానాల్లో నాగర్మల్ పోటీ చేశారు. ఇందిరా, రాజీవ్ గాంధీలతోపాటు వాజ్‌పేయీ, ఎల్‌కే ఆడ్వాణీ, ప్రణబ్ ముఖర్జీ వంటి దిగ్గజ నేతలకు పోటీగా నిలబడ్డారు. అంతేకాదు.. 1969లో రాష్ట్రపతి ఎన్నికల్లోనూ పోటీకి దిగారు. దాదాపు అన్ని ఎన్నికల్లోనూ ఓటమి చెందిన ఆయన సుమారు 300 సార్లు బరిలో నిలవడం విశేషం. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడమే కాకుండా ప్రచారంలోనూ ప్రత్యేక శైలి కనబరిచేవారు. చేతిలో గంటను పట్టుకొని మోగిస్తూ ప్రచారం నిర్వహించేవారు. గాడిదలతో ర్యాలీ నిర్వహించడం, అవినీతికి వ్యతిరేకంగా జంతువుల మెడకు నినాదాలు రాయడం వంటి వినూత్న చర్యలతో స్థానికుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేశారు.

## 'డిజిటల్ అరెస్ట్' కేసులు.. 20 రాష్ట్రాల్లో CBI సోదాలు

డిజిటల్ మోసాలపై నమోదైన కేసులకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ కీలక ఆపరేషన్ చేపట్టింది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 89 చోట్ల సోదాలు జరిపింది. మూడు కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిని అరెస్టు చేసింది. వారి నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు, డిజిటల్ పరికరాలు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. డిజిటల్ అరెస్టుల పేరుతో బాధితుల నుంచి రూ.కోట్ల డబ్బును దోచుకోవడం, వాటిని ఇతర ఖాతాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ సైబర్ నేరగాళ్లు అనేక రాష్ట్రాల్లో డిజిటల్ అరెస్టులకు పాల్పడుతూ బాధితుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్న విషయం తెలిసిందే. ఈ తరహా నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు (Supreme Court) ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీబీఐ.. మూడు కేసుల్లో ప్రధాన నిందితులను అరెస్టు చేసింది. ఈ మూడు కేసుల్లోనే బాధితులు సుమారు రూ.42 కోట్లు నష్టపోయినట్లు సీబీఐ వెల్లడించింది. బిట్స్ పిలానీకి సంబంధించిన ఓ కేసులో పోలీసు అధికారిగా నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మూడు నెలల పాటు డిజిటల్ అరెస్టు (Digital Arrest) చేశారు. బాధితుడి నుంచి రూ.7.67 కోట్లు దోచుకున్నారు. గుజరాత్‌లో మరో కేసులోనూ పోలీసులుగా నటిస్తూ మరో వ్యక్తి నుంచి రూ.19.24 కోట్లు దోపిడీ చేశారు. కర్ణాటకకు సంబంధించిన కేసులోనూ బాధితుడిని నెల రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసి రూ.14.45 కోట్లు తమ ఖాతాలకు మళ్లించుకోవడం గమనార్హం. అరెస్టైన వారిలో హరియాణాకు చెందిన ఆకాశ్.. తన



అకౌంట్లోకి రూ.1.95 కోట్ల నగదు స్వీకరించినట్లు సీబీఐ గుర్తించింది. కోల్‌కతాకు చెందిన రాజ్ కర్మాకర్ ఖాతాలోకి రూ.1.5 కోట్లు, జ్యోతి రాణి అనే యువతి ఖాతాలోకి భారీ మొత్తంలో మోసపూరిత నగదు వచ్చినట్లు సీబీఐ గుర్తించింది. వీటిలో కొంత నగదు విత్‌డ్రా చేయడం, మిగతా మొత్తాన్ని వివిధ ఖాతాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించామని సీబీఐ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

## 'ఇస్రో' విజయం.. దేశానికి గర్వకారణం: మోదీ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన చరిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోదీ అభినందించారు. జీఎస్ఎల్‌వీ ఎఫ్17 మిషన్ విజయవంతం కావడం.. దేశానికి గర్వకారణమంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి ఇది మరొక నిదర్శనమంటూ ప్రధాని (PM Modi) ప్రశంసలు కురిపించారు. ''ఇస్రో సాధించిన మరొక అద్భుతమైన విజయం ఇది. మన దేశానికి ఇది ఎంతో గర్వకారణమైన క్షణం. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఈవోఎస్05.. జీఎస్ఎల్‌వీఎఫ్17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం.. భారత అంతరిక్ష రంగం సాధిస్తోన్న అత్యుత్తమ ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం మన అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడంతో పాటు.. ఈ రంగంలో మన సమర్థతను మరింత బలోపేతం చేస్తోంది'' అని మోదీ (Modi) రాసుకొచ్చారు.



శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్17 వాహకనౌక మేఘాలను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ వ్యోమనౌక ఈఓఎస్05 ఉపగ్రహాన్ని సబ్‌జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్‌జీటీఓ)లోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. సరిహద్దుల్లో శత్రు దేశాలు సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ.. వాటిని ఇట్టే పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. భవిష్యత్తులో ప్రకృతి విపత్తులను, వాటి తీవ్రతను ఇది అంచనా వేయనుంది.

## ప్రైవేట్ కంపెనీలకు స్పేస్‌లో ఎందుకు చోటు? ఇస్రో ఛైర్మన్ సంచలన సమాధానం

- **దేశ అవసరాలు తీర్చేందుకు ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం అవసరమన్న నారాయణన్**
- **ప్రస్తుతం 56 శాటిలైట్లు ఉండగా.. అవసరం వందల్లో ఉందని వెల్లడి**
- **స్పేస్ ఎకోసిస్టమ్ విస్తరణతో ఉద్యోగాలు పెరుగుతాయని వివరణ**
- **ప్రైవేట్ రంగానికి ఇస్రో పూర్తి సహకారం అందిస్తుందని వెల్లడి**
- **జీఎస్ఎల్‌వీ మార్క్ IIతో ఇప్పటివరకు అత్యంత బరువైన శాటిలైట్‌ను ప్రయోగం**

దేశ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెరగడంపై వస్తున్న విమర్శలకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ స్పందించారు. భారత్‌లో పెరుగుతున్న అవసరాలను ఇస్రో ఒక్కటే తీర్చలేదని స్పష్టం చేశారు. దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థతో పాటు మొత్తం స్పేస్ ఎకోసిస్టమ్ మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశం వద్ద 56 శాటిలైట్లు ఉన్నాయని, కానీ అవసరం మాత్రం వందల సంఖ్యలో ఉందని నారాయణన్ తెలిపారు. అందుకే ప్రభుత్వం అంతరిక్ష రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా ఈ రంగంలోకి రావడం ద్వారా మరిన్ని శాటిలైట్లు తయారవుతాయని చెప్పారు. దీంతో ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా



ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యకలాపాలకు ఇస్రో అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఇదిలా ఉంటే శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీఎఫ్17 నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఈఓఎస్ 05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. జీఎస్ఎల్‌వీ మార్క్ II వాహక నౌకతో ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత బరువైన శాటిలైట్ ఇదేనని నారాయణన్ తెలిపారు. జీఎస్ఎల్‌వీ మార్క్ II సామర్థ్యం తొలినాళ్లలో 1,536 కిలోలుగా ఉండేదని చెప్పారు. ఇప్పుడు దాని సామర్థ్యం దాదాపు 40 శాతం పెరిగిందన్నారు. తాజా ప్రయోగం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. కులశేఖరపట్నం స్పేస్‌పోర్ట్ నిర్మాణ పనులు షెడ్యూల్ ప్రకారం సాగుతున్నాయని నారాయణన్ వెల్లడించారు. మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మరోవైపు గగన్‌యాన్ కార్యక్రమం కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. ఈ ఏడాదే తొలి మానవరహిత మిషన్‌ను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.



## ముడి చమురు చోరీ చేస్తూ.. 37మంది మృతి

నైజీరియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ముడిచమురు దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా.. విషవాయువులు విడుదలై 37మంది ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. రివర్స్ స్టేట్ ప్రాంతంలోని ఓ చమురు పైప్‌లైన్ నుంచి ముడిచమురు దొంగిలించేందుకు కొందరు యువకులు యత్నించారు. ఇండోరామా ఎలెమె పెట్రోకెమికల్ కేంద్రాల నుంచి పోర్ట్ హార్కోర్ట్ రిఫైనరీకి ముడి చమురు సరఫరా చేసే ఓ పైప్‌లోని ట్యాపింగ్ పాయింట్‌కు మరో పైపును అనుసంధానించారు. ఆ పైపుతో తమ ఓడల్లోని ట్యాంకులను నింపుతుండగా విషవాయువులు విడుదలయ్యాయి. దీంతో ఈ విష వాయువులు పీల్చి పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 37 మంది మృతదేహాలను నదిలో నుంచి బయటకు తీసినట్లు తెలుస్తోంది. గల్లంతైన వారికోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఆ సన్నని గొంతే ఆశలు నింపి.. నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం!

నేపాల్ విలయంలో గల్లంతైన తమవారు బతికి వస్తారనే ఆశలు సన్నగిల్లుతోన్న వేళ ఓ అద్భుతం జరిగింది. 9 రోజులుగా ఎదురుచూసి.. కొందరి కర్మకాండలు కూడా చేస్తున్న సమయంలో టన్నెల్ నుంచి ఇద్దరు సజీవంగా బయటపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భోటెకోషి నది ఉప్పొంగడంతో 60 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దెబ్బతినగా.. పలువురు సిబ్బంది త్రిశూలి 3ఏ టన్నెల్‌లో చిక్కుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి సంఖ్య 42గా తెలుస్తోంది. తాజాగా సహాయ సిబ్బంది ఇద్దరిని రక్షించడంతో మిగిలిన వారూ ప్రాణాలతో బయటపడతారనే ఆశలు చిగురించాయి. మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌ను సొరంగంలో 170 మీటర్ల లోతు నుంచి కాపాడినట్లు నేపాల్ ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజారామ్ బాస్నెట్ వెల్లడించారు. సహాయక చర్యలను పర్యవేక్షించే అధికారులు, నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మామూలుగా సొరంగం వంటి భూగర్భ ప్రాంతాల్లో కార్మికులు, పర్యాటకులకు సురక్షితమైన ఆక్సిజన్‌తో కూడిన ఎయిర్ ప్యాకెట్స్, ట్రాప్‌డ్ వాటర్



ఉంటాయి. టన్నెల్ లోపల హానికర వాయువుల కారణంగా ప్రాణాలు కోల్పోకుండా బయటనుంచి పైపులు ద్వారా ఆక్సిజన్ పంపుతుంటారు. మరోవైపు, టన్నెల్‌లో చిక్కుకుపోయిన సందర్భంలో తమను తాము రక్షించుకోవడానికి ఎత్తుగా ఉన్నవైపు వస్తుంటారు. కానీ, నేపాల్ (Nepal) జల ప్రళయంలో రాళ్లు, వరద, బురద పెద్ద ఎత్తున కొట్టుకురావడంతో అవి వారిని కిందికి నెట్టేసి ఉండొచ్చు కూడా. చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా..? లేరా..? అనే ఊగిసలాట మధ్య సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బండరాళ్లు, శిథిలాలు తొలగిస్తుండగా.. సమీపానికి వెళ్లేకొద్దీ వారికి లోపల ఉన్నవారి గొంతు సన్నగా వినిపించింది. లోపల దొరికిన నీరు, ఆహారంతో ప్రాణాలు నిలబెట్టుకున్న ఇద్దరు వ్యక్తులు సహాయక సిబ్బందికి కనిపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వారు సొరంగంలోకి దిగి, ఆ ఇద్దరినీ బయటకు తీసుకొచ్చిన దృశ్యాలను నేపాల్ ఆర్మీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. ''ఆశ అందించిన అద్భుత విజయం ఇది'' అని పేర్కొంది. ''ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్నింటినీ తిరగరాస్తోంది (Nepal Tunnel Rescue). ఎందుకంటే ఇంతకముందెప్పుడు ఈ స్థాయిలో విద్యుత్ కేంద్రాలు ధ్వంసమై, పలు సొరంగాల్లో సహాయక చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. కార్ల పరిమాణంలో ఉన్న రాళ్లను పగలగొట్టాం. ఇద్దరిని కాపాడటంతో లోపల ఉన్నవారు బతికే ఉండొచ్చనే అనుమానానికి ఇప్పుడు మాకు ఆధారం లభించింది. మేం పడిన శ్రమకు ఫలితం కనిపిస్తోంది'' అని ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న టన్నెల్ రెస్క్యూ ఎక్స్‌పర్ట్ ఆర్నాల్డ్ డిక్స్ జాతీయ మీడియాతో అన్నారు. 2023లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన ఈ నిపుణుడు.. భారత్‌కు సుపరిచితులు. ప్రస్తుతం టన్నెళ్ల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.




# అడోబ్ సీఈఓగా మళ్లీ భారతీయుడే




అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ నాయకత్వ పగ్గాలు మళ్లీ భారతీయుడికే దక్కాయి. ఇప్పటివరకు సీఈఓగా ఉన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కంపెనీ నూతన సీఈఓగా అనిల్ చక్రవర్తి నియమితులయ్యారు. డిసెంబర్ 1న అనిల్ ఈ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏఐ ప్రభావం నేపథ్యంలో డిజైన్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అడోబ్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థలో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు దశాబ్దాలుగా సీఈఓగా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఈ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు మార్చిలో కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం ఈయన ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఏఐ యుగంలో అడోబ్ వృద్ధికి నాయకత్వం వహించడానికి అనిల్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నానని శంతను నారాయణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారత్‌కు చెందిన అనిల్ చక్రవర్తి ఐఐటీ వారణాసి నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ చదివారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. 2020లో ఆయన అడోబ్‌లో చేరారు. కొన్నేళ్లపాటు డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ వ్యాపారానికి నాయకత్వం వహించారు. అనంతరం కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత చేపట్టారు. అదే సమయంలో సంస్థ గ్లోబల్ సేల్స్‌ను కూడా పర్యవేక్షించారు. అడోబ్‌లో చేరడానికి ముందు అనిల్ చక్రవర్తి క్లౌడ్ డేటామేనేజ్‌మెంట్ కంపెనీ ఇన్‌ఫర్మేటికాలో నాలుగేళ్ల పాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

# 1,00,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నాం: ఫోక్స్‌వ్యాగన్ ప్రకటన



జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తగ్గించుకోనుంది. ఈ దశాబ్దం చివరినాటికి లక్ష ఉద్యోగాలకు కోత పెట్టనుంది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. తొలుత 50వేల మందిని తొలగించాలని నిర్ణయించిన సంస్థ.. అదనంగా మరో 50వేలమంది తొలగింపు ప్రణాళికను కూడా ఆమోదించినట్లు చెప్పింది. ''కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా శ్రామికశక్తి సర్దుబాటు చేయడం తప్పనిసరి'' అని పేర్కొంది. ఇదే జరిగితే.. ఇది ఆటో పరిశ్రమ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ కానుంది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఈ లక్ష మంది దాదాపు 15 శాతానికి సమానం. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌లో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోనే 43 శాతం మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కోతలను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు కంపెనీ ప్రకటనలో కోతలకు ఆ సంఘాలు కూడా అంగీకరించినట్లు పేర్కొనడం గమనార్హం. అలాగే నాలుగు జర్మన్ ప్లాంట్లను మూసే ప్రణాళికను ప్రస్తావించింది. ఇదిలా ఉంటే, ఉంటే.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ ఖర్చులు, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ టారిఫ్‌ల ఒత్తిళ్లను తట్టుకోవడానికి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ సంస్థ ఫోక్స్‌వ్యాగన్, ఆడి, పోర్షే, లాంబోర్గిని, బెంట్లీ వంటి పాసింజర్ వాహనాలతో పాటు, స్కానియా, డుకాటీ వంటి కమర్షియల్, టూవీలర్ ఆటోమొబైల్ బ్రాండ్లను నిర్వహిస్తోంది. దివాలా తీసినట్లు 2009లో జనరల్ మోటార్స్ ప్రకటించిన తర్వాత 50,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇప్పుడు ఫోక్స్ వ్యాగన్ లేఆఫ్‌ల సంఖ్య దానిని అధిగమించింది.

# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్.. ప్రాజెక్ట్‌కు ఒక్కరూ ముందుకు రాలేదు



ఢిల్లీ: కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ కరవైంది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఒక్కరూ ముందుకు రాలేదు. సెప్టెంబర్ 7తో ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగియనుండగా.. ప్రైవేటు సంస్థల నుంచి గానీ, ప్రభుత్వ రంగం నుంచి గానీ ఒక్క దరఖాస్తూ రాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మన దేశంలో బొగ్గు నిల్వలు పుష్కలం. కానీ కర్బన ఉద్గారాల బెడద కారణంగా వాటిని సమర్థంగా వినియోగించుకోలేక.. ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతున్నాం. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' విధానాన్ని ఆయుధంగా మలచుకోవాలని కేంద్రం తాజాగా సంకల్పించింది. ఇందుకోసం రూ.37,500 కోట్లతో ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర పడింది. 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేయడమే లక్ష్యంగా ఇటీవల ఈ పథకాన్ని కేంద్రం ప్రకటించింది.

# పోకో నుంచి 2 కొత్త ఫోన్లు.. 10K బ్యాటరీతో పోకో X8 పవర్




దిల్లీ: షావోమీ అనుబంధ సంస్థ పోకో (Poco) దేశీయ మార్కెట్‌లోకి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను తీసుకొచ్చింది. మిడ్‌రేంజ్‌లో ఎక్స్8 (Poco X8), ఎక్స్8 పవర్‌ను (Poco X8 power) విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఎక్స్8 ప్రో, ఎక్స్8 ప్రో మ్యాక్స్‌ను ఇది వరకే తీసుకొచ్చింది. ఇక, పోకో ఎక్స్8 పవర్ వేరియంట్‌ను 10,000 ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకురావడం విశేషం. స్టాండర్డ్ వేరియంట్ ఎక్స్8లో 9,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. రెండింట్లోనూ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే ఇవ్వడం విశేషం.

**పోకో ఎక్స్8 పవర్, ఎక్స్8 ప్రత్యేకతలు**

ఈ రెండు స్మార్ట్‌ఫోన్లు ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3తో పనిచేస్తాయి. నాలుగేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. రెండు ఫోన్లనూ 6.83 అంగుళాల 1.5k సూపర్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకురావడం గమనార్హం. 120Hz రిఫ్రెష్‌రేటు, డాల్బీ విజన్, 3,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. రెండింటికీ కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 ప్రొటక్షన్ ఉంది. ఐపీ66, ఐపీ 68, ఐపీ 69, ఐపీ69kతో కూడిన డస్ట్, వాటర్ రెసిస్టెన్స్ ఇచ్చారు. రెండు ఫోన్లలోనూ 50 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. దీంతో పాటు 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. 2 ఎంపీ డెప్త్ సెన్సర్ అమర్చారు. ఎక్స్8 పవర్‌లో 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇవ్వగా.. పోకో ఎక్స్8లో మాత్రం 16 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇవ్వడం గమనార్హం. పోకో ఎక్స్8 పవర్‌లో 10,000 ఎంఏహెచ్ బ్యాటరీ 100W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 27W రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. పోకో ఎక్స్8లో 9000 ఎంఏహెచ్ బ్యాటరీ 67W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 22.5W వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సౌలభ్యం ఉంది. రెండింటిలోనూ ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ అమర్చారు.

**ధరలు ఇలా..**

పోకో ఎక్స్8 ధరలు రూ.29,999 నుంచి ప్రారంభమవుతాయి. పోకో ఎక్స్‌ప్రో ధర రూ.35,999 నుంచి మొదలవుతుంది. రూ.2 వేలు కూపన్ డిస్కౌంట్, రూ.1000 ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నారు. దీంతో ఆ మేర ఫోన్ల ధరలు తగ్గనున్నాయి. సెప్టెంబర్ 11 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయానికి రానున్నాయి.

# సచిన్ లాంటి కెరీర్‌ను సూర్యవంశీ నిర్మించుకోవాలి: సైకియా



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రశంసల వర్షం కురిపించారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌లా అద్భుతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఏదో ఒక సిరీస్ లేదా ఒక సంవత్సరంలో మాత్రమే కన్పించే వండర్ ప్లేయర్‌గా మారకూడదన్నారు. గురువారం బీసీసీఐ రివ్యూ మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం సైకియా విలేకర్లతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ ప్రస్తావననూ తీసుకొచ్చారు. ''ఓ 15 ఏళ్ల కుర్రాడిని అంతర్జాతీయ క్రికెట్‌లోకి తీసుకొచ్చినందుకు బీసీసీఐ గర్వపడుతోంది. అతడి సత్తా ఏంటో ఇప్పటికే అభిమానులకు చూపించాడు. మున్ముందూ ఇలానే సరైన మార్గంలో సాగాలని కోరుకుంటున్నా. కొన్ని మ్యాచులకే పరిమితం కాకుండా.. సుదీర్ఘమైన కెరీర్‌ను నిర్మించుకోవాలి. అందుకు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను వైభవ్ ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జాతీయ కెరీర్‌లో అతడు వేసే ప్రతి అడుగును అన్ని కోణాల నుంచి నిశితంగా గమనిస్తూనే ఉంటాం. వైభవ్ భవిష్యత్తుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టిసారించింది'' అని సైకియా వెల్లడించారు.

**సఫారీలతో వన్డే సిరీస్ ?**

ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే, వరల్డ్ కప్ ముంగిట సఫారీ జట్టుతో సిరీస్ ఆడితే బాగుంటుందనేది భారత జట్టు ఆలోచన. ఇదే విషయమై మేనేజ్‌మెంట్ కూడా దక్షిణాఫ్రికా బోర్డుతో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వన్డే సిరీస్‌లో కనీసం నాలుగు నుంచి ఆరు మ్యాచులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలోనూ బోర్డు కఠినంగా ఉండనుంది. రివ్యూ మీటింగ్‌లో ఇదే ప్రధాన అంశంగా చర్చించినట్లు సమాచారం.




# నేనెప్పుడూ అలా ఆలోచించలేదు

**: స్మృతి మంధాన**



మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు ఆ ఘనత మిథాలి రాజ్ (10,868) పేరిట ఉండేది. దీనిపై స్మృతి మంధాన స్పందించింది. తానెప్పుడూ మిథాలి రికార్డు గురించి ఆలోచించలేదని.. తనకు వ్యక్తిగత గణాంకాల కంటే భారత్ విజయాలే ముఖ్యమని బీసీసీఐ వీడియోలో స్పష్టం చేసింది. ''నేను బ్యాటింగ్ చేస్తున్నంత సేపూ రికార్డుల గురించి పట్టించుకోను. ఈ ఘనత సాధించాక మాత్రం చాలా ఆనందంగా అనిపించింది. మిథాలి రాజ్ లెజెండరీ క్రికెటర్. మాకు రోల్ మోడల్. ఆమె బ్యాటింగ్‌ను చూస్తూ పెరిగాం. పరుగుల విషయంలో ఆమెను దాటేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఇక, ఈ లిస్ట్‌లో తొలి రెండు స్థానాల్లో భారత ప్లేయర్లే ఉండటం సంతోషంగా అనిపిస్తోంది. అయితే, నాకు గణాంకాల కంటే భారత్ విజయం సాధించడమే ముఖ్యం'' అని మంధాన తెలిపింది.

**ఇక్కడ ఆడటం తేలికేం కాదు..**

''ఆసియా కప్ జరుగుతోన్న దుబాయ్ పిచ్‌లపై ఆడటం తేలికగా అనిపించలేదు. మా మిడిలార్డర్ నుంచి ఎక్కువ పరుగులు రాలేదు. ప్రతి ఒక్కరూ అత్యున్నత ప్లేయర్లే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, ఇక్కడి వాతావరణం ఇబ్బంది పెడుతోంది. స్టీమ్ బాక్స్‌లో ఉన్నట్లే ఉంది. ఉక్క, ఎండ వేడిమికి మ్యాచులు ఆడటం కాస్త కష్టమే. అయితే, తప్పకుండా ఈ పరిస్థితులను అలవాటు చేసుకొని పరుగులు రాబడతారనే నమ్మకం నాకుంది'' అని మంధాన తెలిపింది. ఇక, మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టాప్ స్కోరర్‌గా నిలవాలంటే మంధానకు మరో 78 పరుగులు అవసరం. ప్రస్తుతం ఆమె 4,681 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ ప్లేయర్ బేట్స్ 4,758 పరుగులతో అగ్రస్థానంలో ఉంది. ఈ ఆసియా కప్‌లోనే స్మృతి ఆ రికార్డునూ కొట్టేసే అవకాశం లేకపోలేదు.

# రోహిత్ యాదవ్ ఒక్కడే కాదు.. మరో 61 మంది దొరికిపోయారు!



పశ్చిమ్ బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ బోర్డు రెండేళ్ల పాటు నిషేధం విధించింది. తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు ఆరోపణలు రావడంతో బీసీసీఐ చర్యలు చేపట్టింది. రాబోయే ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆడేందుకు ఇటీవలే రోహిత్ అండర్ 19 జట్టుకు ఎంపిక కావడం గమనార్హం. ఇప్పుడీ నిషేధంతో అతడిని టీమ్ నుంచి తప్పించడం ఖాయం. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రోహిత్ యాదవ్ గత జులైలో అండర్ 19 జట్టుతో శ్రీలంక పర్యటనకు వెళ్లాడు. అనధికారిక టెస్టుల్లో ఆరు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇప్పుడు ఆసీస్‌తో ఆడే టీమ్‌కూ ఎంపికయ్యాడు.

**శ్రీలంకలోనే బయటపడింది..**

శ్రీలంక పర్యటనకు వెళ్లినప్పుడే రోహిత్ యాదవ్ పత్రాలను పరిశీలించగా.. వయసులో వ్యత్యాసం వెలుగులోకి వచ్చింది. రోహిత్ వద్ద 2007, 2009, 2010 సంవత్సరాల్లో పుట్టినట్లుగా మూడు ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. దీంతో అతడు అండర్ 19 క్రికెట్‌ను ఆడేందుకు అనర్హుడైనట్లే. అతడి ఆధార్ కార్డుల్లోని వయసు కూడా సరిగాలేదు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) వద్ద తన పేరును నమోదు చేసుకున్నప్పుడు పుట్టిన సంవత్సరాన్ని 2007గా పేర్కొన్నాడు. కానీ, అతడు 2017, 2020లో అప్‌డేట్ చేసిన ఆధార్ కార్డులో మాత్రం పుట్టిన సంవత్సరం 2006గా ఉంది. ఇక 2021లో అయితే దాన్ని 2009గా మార్చుకున్నాడు. దీంతో రోహిత్ జూనియర్ జట్టుతో ఆడేందుకు అనర్హుడని, తప్పుడు పత్రాలు సమర్పించినట్లు బీసీసీఐకి (BCCI) సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలో బోర్డు రోహిత్‌పై రెండేళ్లపాటు నిషేధం విధించినట్లు అన్ని రాష్ట్రాల బోర్డులకు తెలియజేసింది.

**క్యాబ్ విచారణలో 62 మంది..**

202627, 202728 సీజన్లలో ఆడేందుకు క్యాబ్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రికెటర్లలో రోహిత్‌తోపాటు 62 మంది ప్లేయర్లు అనర్హతకు గురయ్యారు. ఇందులో అండర్ 19 వరల్డ్ కప్ విన్నర్ రవికుమార్, స్పిన్ ఆల్‌రౌండర్ విశాల్ భట్టి కూడా ఉన్నారు. తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు తేలింది. దీంతో వారిపై క్యాబ్ అనర్హత వేటు వేసింది.



# 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా.. భారత్, జపాన్ మధ్య టీ20 మ్యాచ్

భారత్, జపాన్ మధ్య ఏళ్లుగా విడదీయరాని సంబంధం ఉంది. ఆ దేశానికి చెందిన ఎన్నో ప్రముఖ సంస్థలు భారత్‌లో కంపెనీలు స్థాపించి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములయ్యాయి. భారత్, జపాన్ మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా భారత పురుషుల క్రికెట్ టీమ్ సెప్టెంబర్ 22న ఆ దేశంతో టీ20 మ్యాచ్ ఆడబోతోంది. ఇరు దేశాల్లో ఇది చరిత్రాత్మంగా నిలవనుంది. ఈ విషయాన్ని బీసీసీఐ ధ్రువీకరించింది. జపాన్‌లోని టోచిగిలో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ నిర్వహించనున్నారు. భారత ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మధ్య జరిగిన భేటీలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇరు దేశాల్లోని క్రీడలు, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి చేపట్టిన 'స్పోర్ట్ 75'లో ఇది భాగమని బీసీసీఐ పేర్కొంది. ఈ నెలలోనే జపాన్ వేదికగా ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. అయితే, భారత క్రికెట్ పురుషుల జట్టు బైతో నేరుగా క్వార్టర్ ఫైనల్స్ రౌండ్‌లో ఆడనుంది. జపాన్ గ్రూప్ స్టేజీలో ఆడనుంది. భారత్, జపాన్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్‌ను బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కీలక ఘట్టంగా అభివర్ణించారు. చారిత్రక ఘట్టంలో భాగమవుతున్నందుకు బీసీసీఐకి ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మ్యాచ్ జపాన్, తూర్పు ఆసియా ప్రాంతాలకు క్రికెట్‌ను పరిచయం చేసేందుకు విస్తృత అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రపంచ ఛాంపియన్‌ను తమ దేశంలోకి ఆహ్వానించడం ఒక మైలురాయి అని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నావోకీ మియాజీ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంతో టీ20 ర్యాంకింగ్స్‌లో 41వ స్థానంలో ఉన్న జపాన్‌కు.. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌తో తలపడడం ఓ అరుదైన అవకాశంగా చెప్పవచ్చు.



# పోస్టర్‌తో రూమర్లకు చెక్

మెగాస్టార్ చిరంజీవి కాకా మూవీ సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్నట్లు వస్తున్న వార్తలకు మేకర్స్ చెక్ పెట్టారు. షూటింగ్ అప్‌డేట్‌ను కూడా రివీల్ చేశారు. ఈనెల 7 నుంచి హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ మొదలు కాబోతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి వర్కింగ్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చిరంజీవితో ఓ సీన్ గురించి సీరియస్‌గా డిస్కస్ చేస్తూ డైరెక్టర్ బాబీ కనిపిస్తుండగా ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ మూవీలో చిరంజీవి డ్యూయల్ రోల్ అలరించబోతున్నారు. జనవరి 13నే ఈ మూవీ విడుదల కానున్నట్లు వెల్లడించారు. ఈ మూవీకి థమన్ మ్యూజిక్ అందిస్తుండగా వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు.



సినిమా

# యాక్షన్ రోల్‌లో అనన్య



లీసా పేరుతో ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో హీరోయిన్‌గా నటిస్తోంది అనన్య నాగళ్ల. ఇప్పటివరకు సాఫ్ట్ రోల్స్‌లో కని-పించిన అనన్య ఇందులో యాక్షన్ ప్రధానంగా సాగే పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఆమె క్యారెక్టర్‌కు సంబంధించి వచ్చే ట్విస్ట్‌లు లీసాకు హైలైట్‌గా ఉండబోతున్నట్లు చెబుతున్నారు. రష్మిక మందన్న సొంతూరు విరాజ్‌పేట నేపథ్యంలో ఈ తెలుగు సినిమా కథ సాగుతుందని అంటున్నారు. లీసా షూటింగ్ పూర్తి కాగా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. నవంబర్‌లో థియేటర్లలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీకి జవహర్ పవార్ దర్శకత్వం వహిస్తున్నారు.

# లేడీ సూపర్‌స్టార్‌పై ట్రోల్స్

సొంత సినిమా కోసం గత 10 ఏళ్లుగా పాటిస్తోన్న ఓ రూల్‌ను బ్రేక్ చేసింది నయనతార. ఆమె హీరోయిన్‌గా నటిస్తూ నిర్మించిన తమిళ మూవీ హాయ్ ఇటీవలే రిలీజైంది. ఈ సినిమా కోసం కెరీర్‌లో ఫస్ట్ టైమ్ సినిమా ఆడుతున్న థియేటర్లను సందర్శించింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చెన్నైతో పాటు తిరుచ్చి, మధురైలోని కొన్ని థియేటర్లను నయన్ సందర్శించిం ది. లేడీ సూపర్ స్టార్‌ను థియేటర్లలో చూసిన ఆడియెన్స్ సర్‌ప్రైజయ్యారు. సినిమాల ప్రమోషన్స్ విషయంలో మారిపోయిందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. డబ్బులు పోతాయనే భయంతోనే ఇలా ప్రమోట్ చేస్తుందని మరికొందరు అంటున్నారు. దాదాపు 20 కోట్ల బడ్జెట్‌తో స్వయంగా ఈ మూవీని నిర్మించింది నయన్.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| నెట్‌ఫ్లిక్స్ : | కొరియన్ కనకరాజు (తెలుగు)<br>జీడీఎన్ (తెలుగు)<br>గాంధారి (హిందీ)<br>ధమాల్ 4 (హిందీ)<br>టర్నింగ్ పాయింట్ (ఇంగ్లీష్) |
| అమెజాన్ ప్రైమ్ వీడియో: | జగమే సంగీతం వెబ్ సిరీస్ (తెలుగు)<br>పళ్లబురుసు (తెలుగు)<br>అనంతన్‌కాడు (మలయాళం)<br>అరుళ్‌వాన్ (తమిళం)<br>రక్కీ (కన్నడ)<br>కన్ఫైన్‌మెంట్ (ఇంగ్లీష్)<br>ది రన్నర్ (ఇంగ్లీష్) |
| సోనీ లివ్: | ఉన్మాదం (మలయాళం)<br>బ్యాక్‌రూమ్స్ (ఇంగ్లీష్) |
| సన్ నెక్స్ట్: | డీసీ (తమిళం) |
| జియో హాట్ స్టార్: | ది కోర్ట్ వెబ్ సిరీస్ (తమిళం)<br>స్టార్ వార్స్ (ఇంగ్లీష్) |
| ఈటీవీ విన్: | జ్ఞాపకాలు (తెలుగు) |



# టైం లేకపోవడం వల్లే పోలే

తమిళ మూవీ ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు కయదు లోహర్ దూరంగా ఉండటంపై కోలీవుడ్ ఫ్యాన్స్ ట్రోల్ చేస్తున్న వేళ ఈ కాంట్రవర్సీపై ఆమె రియాక్ట్ అయ్యింది. ఈ విమర్శల వెనుక రాజకీయాలు, పీఆర్ గేమ్స్ ఉన్నాయి. అలాంటివి చేయడం నాకు రాదు. ఐ యామ్ గేమ్ కోసం ఎంత కష్టపడ్డానో ఇమ్మోర్టల్ కోసం అంతే శ్రమించా. కేవలం ప్రమోషన్స్‌కు అటెండ్ కాలేదనే సాకుతో నన్ను టార్గెట్ చేస్తున్నారు.సోషల్ మీడియాలోవచ్చేట్రోల్స్, మీమ్స్‌ను అస్సలు పట్టించుకోను. ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు హాజరు కావాలని అనుకున్నా. కానీ అప్పటికే ఉన్న కమిట్‌మెంట్స్, టైమ్ లేకపోవడం వల్ల కుదరలేదు. అంతే తప్ప దీని వెనుక ఎలాంటి దురుద్దేశం లేదు. నాకు తమిళం, మలయాళం, తెలుగు అనే భేదాలు లేవు అంటూ కయదు చెప్పుకొచ్చింది.

# ట్రోల్స్‌కు నాట్యంతో ఆన్సర్

ఇటీవల హిందూ మతం, సనాతన ధర్మంపై యాంకర్ అనసూయ చేసిన కామెంట్లు వివాదాస్పదమ వడంతో నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ఈ విమర్శలపై కృష్ణాష్టమి సందర్భంగా వెరైటీగా బదులిచ్చింది. తులసి కోమలవేణి.. నీలవర్ణ రాణి.. నిత్య కల్యాణి అనే కన్నడ భక్తి గీతానికి సంప్రదాయబద్ధంగా నాట్యం చేసింది. క్షమాగుణం, దేవుడిపై విశ్వాసం ప్రతి మనిషికి సహజంగా ఉండే గుణం అంటూ ఈ వీడియోకు ఓ క్యాప్షన్‌ను కూడా జోడించింది. కృష్ణుడికి అంతా తెలుసు అంటూ పేర్కొన్నది. ఆమె ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది.

